మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏడో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల, కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

- సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ
- కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్థక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

- కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు
- మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర
- హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

- చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

- దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

ఉసురు తీసిన సమస్యలు

వివిధ కారణాలతో జిల్లాలో ముగ్గురి ఆత్మహత్య

కుటుంబ కలహాలతో ఇద్దరు.. ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం

బచ్చన్నపేట/స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 19: వివిధ కారణాలతో జిల్లాలో ఒకే రోజు ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు బలన్మరణానికి పాల్పడగా.. తల్లిదండ్రుల గొడవతో మనస్తాపం చెంది ఓ యువతి, అదే విధంగా భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనతో ఓ యువకుడు ఉసురు తీసుకున్నారు. ఈ మూడు ఘటనలతో ఆయా కుటుంబాలలో విషాదం నెలకొంది.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..


సాయిమల్లయ్య (ఫైల్)

బచ్చన్నపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతు పరిదె సాయిమల్లయ్య (42) తన వ్యవసాయ బావి వద్ద సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తనకున్న నాలుగు ఎకరాల్లో నాటు వేయగా, బోరు ఎత్తిపోవటంతో ఎకరం పొలం ఎండిపోయింది. మరోవైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెంది సోమవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కాగా అతడి భూములు యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ పరిధిలో ఉండటంతో రాజపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరుకు తరలించారు. బాధిత రైతుకు భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తల్లిదండ్రులు గొడవ పడడాన్ని తట్టుకోలేక బాలిక..


సన్నిధి (ఫైల్)

తల్లిదండ్రులు తరుచుగా గొడవపడడాన్ని తట్టుకోలేక స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన గుండ్లపల్లి సన్నిధి (17) అనే యువతి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లి రాజు-హైమావతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె సన్నిధి ఘన్‌పూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కొన్ని రోజులగా సన్నిధి తల్లిదండ్రులు తరుచుగా గొడవ పడుతున్నారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. అయినప్పటికీ వారిలో మార్పు రాలేదు. దీంతో వారం రోజుల క్రితం హైమావతి తన చిన్నకుమార్తెను తీసుకొని తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉంటున్న సన్నిధి 18వ తేదీ రాత్రి బయటకు వెళ్లిన తన తండ్రి రాజుకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. తర్వాత ఫ్యాన్‌కు ఉరేసుకుంది. రాజు రాత్రి 9గంటలకు ఇంటికి వచ్చే సరికి లోపల గడియపెట్టి ఉంది. ఎంత అరిచినా తలుపు తీయకపోవడంతో వాటిని తొలగించి ఇంట్లోకి వెళ్లేసరికి అప్పటికే చనిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..


రాజు నాయక్ (ఫైల్)

భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త కొర్ర రాజునాయక్ (23) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడెం గ్రామ పరిధిలోని జాలితండాకు చెందిన రాజునాయక్ తన తల్లి కొర్ర రాధతో కలిసి కొన్నేళ్ల క్రితం ఘన్‌పూర్‌కు వచ్చి కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రాధ కూరగాయలు విక్రయిస్తుండగా రాజు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రాజుకు, హైదరాబాద్‌కు చెందిన సంగీత అనే యువతితో ఏడు నెలల క్రితం వివాహమైంది. కొన్ని రోజులపాటు సజావుగానే సాగిన వీరి కాపురంలో తర్వాత కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గత డిసెంబరులో సంగీత సమాచారం లేకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తర్వాత పోలీసులు ట్రేస్‌చేసి సంగీతను తీసుకువచ్చారు. అప్పటి నుంచి సంగీత తన తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. అప్పటికే గర్భం దాల్చిన సంగీత అబార్షన్ చేయించుకోవడంతో పాటు, కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన రాజునాయక్ ఈ నెల 17న తన భార్య వద్దకు వెళ్తున్నానని తల్లికి చెప్పాడు. అదే రోజు తల్లి రాధ వ్యక్తిగత పనుల నిమిత్తం జాలితండాకు వెళ్లింది. 18వ తేదీ మధ్యాహ్నం రాజుకు ఫోన్ చేసి మాట్లాడింది. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో సోమవారం ఉదయం ఆమె ఇంటికి వచ్చేసరికి రాజునాయక్ ఇంటివెనుకాల ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన వాటికలో బోరు బావి పనులు

రఘునాథపల్లి, ఫిబ్రవరి 19: జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ నిధుల నుంచి మండలంలోని కంచనపల్లి గ్రామంలోని శ్మశానవాటికలో రూ2.80 లక్షల వ్యయంతో బోరు, బోరు మోటారుతో పాటు పైపు లైన్ తదితర నిర్మాణ పనులను గ్రామస్థులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ గవ్వాని నాగేశ్వర రావు, గుండె జోసఫ్, దైద ప్రభాకర్, కుమార్, వంగ శ్రీను, సుధాకర్, రాజు, బాబు, ప్రవీణ్, మనోజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


జనగామలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందువులు


నర్మెటలో శివాజీ జయంతి నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు


ఘన్‌పూర్‌లో బీజేపీ నాయకుల శోభాయాత్ర


ఇబ్రహీంపూర్‌లో నివాళులర్పిస్తున్న ఆరె కులస్థులు

ఛత్రపతి శివాజీకి జన నివాళి

శోభాయాత్రలు నిర్వహించిన బీజేపీ అనుబంధ సంఘాలు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు మండలంలోని కూనూరు, సాగరంలో ఘనంగా జరిగాయి. శ్రీరాం హనుమాన్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ ఆధ్వర్యంలో కూనూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీరాం హనుమాన్ సేన, బీజేపీ, అనుబంధ సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని వివిధ వీధుల గుండా ప్రదర్శనగా సాగుతూ శివాజీని కీర్తిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నాగేశ్ గౌడ్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ దేశభక్తిని చాటుతూ హిందువుల హక్కులు, స్వరాజ్య స్థాపన కోసం మొఘలులపై ఆయన సాగించిన వీరోచిత పోరాటం అసామాన్యమని శ్లాఘించారు. కాగా, ఈ ర్యాలీని కూనూరు, ఉప్పుగల్లు మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని శివాజీ విగ్రహం వరకు నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించారు. సాగరంలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆరె కులస్తులు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీరాం సేన, బీజేపీ, అనుబంధ సంఘాల జిల్లా, మండల ప్రతినిధులు మూల మహేశ్‌గౌడ్, తిరుపతి, ఓరుగంటి రాజు, మహ్మద్ అఫ్జల్, కోట నరేశ్, రాకేశ్, చెన్నూరు రాజు, రాకేశ్ పటేల్, ఆరె సంక్షేమ ప్రతినిధులు మోరె శ్రీనివాస్, లోనె నాగేశ్వర్‌రావు, మహేశ్వర్ రావు, మల్లయ్య, వజీరు రాజేశ్వర్‌రావు, గోపాల్, కైరిక మల్లయ్య, టి.రాజేశ్వర్‌రావు, మైసరావు, యువరాజు పాల్గొన్నారు.

జనగామ కల్చరల్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సోమవారం హిందూవాహిని ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ శోభాయాత్రను ప్రారంభించారు. శివాజీ మహారాజ్ కి జై .... జై శ్రీరాం.... అంటూ నినాదాలు చేస్తూ అధిక సంఖ్యలో హిందూ సోదరులు ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. యువకులు ఉత్సాహంతో నృత్యాలు చేశారు. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు శోభాయాత్ర నిర్వహించగా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఛత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్ మండల శాఖల ఆధ్వర్యంలో శివునిపల్లి రైల్వే స్టేషన్ నుంచి శివాజీ విగ్రహం వరకు శోభాయాత్ర నిర్వహించారు. విగ్రహానికి పుష్పాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక శివాజీ విగ్రహానికి పూలే అంబేద్కర్ విజ్ఞాన వారియర్స్ జేఏసీ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా, మండల నాయకులు కోరుకొప్పుల నగేష్, ఎం.మహేష్, బి.తిరుపతి, ఓ.రాజు, అఫ్జల్, దినేష్, నరేష్, సిహెచ్ రాజు, సాయి, కార్తీక్, సాంబరాజు, రాకేష్, సందీప్, శివరాం, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో కొడకండ్లలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సున్నపోజ విశ్వాస్, ప్రతినిధులు సుంకరనేని కోటేశ్వర్, మోడెపల్లి సోమన్న, రాము, సాయిదుర్గ, చరణకుమార్, రాహుల్, స్వామి, అజయ్, సోహెల్, సోమన్న, సంపత్, సిద్ధు, సాత్విక్, సంజయ్; హర్ష తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఇబ్రహీంపూర్ గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఆరె కులస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోర్తాల మహేందర్, గాజులపాటి మైసారావు, శ్రీను, మల్లేష్, కిషన్ రావు, సోమల్లయ్య, సుధాకర్, రాజు, మాజీ సర్పంచ్ దొరగల్ల అయిలమ్మ, లక్ష్మయ్య, దొరగల్ల యాదగిరి, భాస్కర్, మల్లయ్య పాల్గొన్నారు.

దేవరుప్పుల: సీతారాంపురం గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కడవెండిలో ఆరె మరాఠీలు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వరికెల రతన్, కాంటారి భాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

నర్మెట: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ, దళిత మోర్చా నాయకులు కొన్నె రాజు, బుచ్చాల కొమురెల్లి, చల్లం శంకరయ్య, ముదిగొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు బావుల వద్ద సర్వీస్ వైర్ల చోరీ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 19: మండలంలోని పోచన్నపేట గ్రామ శివారులో గల వ్యవసాయ బావుల వద్ద గత కొన్ని రోజులుగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. సర్వీస్ వైర్లు కత్తిరించుకుని వెళుతున్నారు. నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు ఇదే విధంగా జరగటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎత్తుకెళ్లిన వైరును కాల్చి అందులోని కాపర్‌ను తెలిసిన వారికి అమ్ముకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. బోరుమోటర్ నుంచి స్టార్టర్ వరకు ఉన్న వైరు ఖరీదు మీటరు రూ.90 నుంచి రూ.150 వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన పెద్దవాగుకు ఒకవైపు, వారం రోజుల క్రితం మరోవైపు ఉన్న వైర్లను ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి పెద్ద రామన్‌చర్ల వైపు గల వ్యవసాయ బావుల వద్ద చోరీలు జరిగాయి. ఇప్పటికైనా పోలీసులు దొంగల ఆట కట్టించాలని రైతులు బాధిత రైతులు గ్రామస్థులు కోరుతున్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పాలకుర్తి, ఫిబ్రవరి 19 : రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను నియమించిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం రాజీవ్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు గాదెపాక భాస్కర్ మాట్లాడుతూ సిరిసిల్ల రాజయ్యకు ఈ అవకాశమిచ్చిన ముఖ్యమంత్రికి తెలిపారు.

హస్త కళాకారుడికి ఘన సన్మానం

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 19: జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ప్రముఖ హస్త కళాకారుడు, అయిలా పోతులూరయ్యాచారి (92)ను సోమవారం ఘనంగా సత్కరించారు. పెంబర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన 92వ జన్మదినాన్ని గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహ పూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోతులూరయ్యాచారి మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగా సాధన, ధ్యానము, శాకాహార భోజనం అలవాట్లు కలిగి ఉండటమే తన ఆరోగ్య రహస్యమన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయి పంపిణీ చేశారు.

టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకుర్తి, ఫిబ్రవరి 19 : టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీ సోమవారం ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా వీరమల్ల బాబయ్య, ప్రధాన కార్యదర్శిగా చిదురాల రమేష్, ఉపాధ్యక్షులుగా తోట వెంకట్, ఆర్ సరస్వతీ, కోశాధికారిగా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్ తెలిపారు.

శభాష్ సోని..

(3వ పేజీ తరువాయి)

ముందుకు సాగారు. 2023లో పోలీస్ కానిస్టేబుల్‌గా, సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. ఎస్సైగా శిక్షణ తీసుకుంటున్న క్రమంలో రెండు రోజుల క్రితం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. కాని తనకు ఎస్సైగా సేవలు అందించటమే ఇష్టమని చెబుతున్నరు. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్థానిక ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ, బీఈడీ జనగామలో పూర్తి చేసిన సోనీగౌడ్ హనుమకొండ హాస్టల్‌లో ఉంటూ 2022-23లో కోచింగ్ తీసుకుని పరీక్షలు రాశారు. ఒక ఉద్యోగం పొందేందుకు అష్టకష్టాలు పడుతున్న ఈ రోజుల్లో మూడు పరీక్షలు రాస్తే అన్నింటిలో అవకాశాలు తలుపు తట్టడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆమె మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో చోరీ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 19: మండలంలోని పోచన్నపేట గ్రామంలో ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. వేముల సత్యనారాయణ అనే వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు మేడారం జాతర కోసం వెళ్లగా, సత్యనారాయణ ఆదివారం ఉద్యోగానికి వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాగా తాళం పగులకొట్టి బీరువా ఓపెన్ చేసి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సతీష్‌కు మార్ క్లూస్‌టీంను పిలిపించి వివరాలు సేకరించారు. రూ. 2 లక్షల నగదు పోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

వేస్ట్ డీకంపోజర్‌తో పర్యావరణ సమతౌల్యం

రఘునాథపల్లి, ఫిబ్రవరి 19: వేస్ట్ డీకంపోజర్‌తో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని దేశ్‌పాండే ఫౌండేషన్ క్షేత్ర సహాయకుడు గంపల అబ్బయ్య అన్నారు. కోమల్ల గ్రామంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పత్తి పంటపై వేస్ట్ డీకంపోజర్‌ను స్ప్రే చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి క్షేత్ర స్థాయిలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. పత్తి పంట పైన వేస్ట్ డీకంపోజర్‌ను స్ప్రే చేసిన తర్వాత పంటను భూమిలో కలియ దున్నాలని, దీంతో పత్తి కట్టె భూమిలో కుళ్లిపోయి నేల సారవంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు అన్నపు రెడ్డి, ఫౌండేషన్ బాధ్యులు మునిగల మమత, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన సెయింట్ పాల్స్


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 19: జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల హైద్రాబాద్‌లో నిర్వహించిన నాల్గవ జాతీయ కరాటే పోటీలలో పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ప్రతి విద్యార్థిలోనూ అంతర్లీనంగా దాగి ఉన్న శక్తులను శిక్షణ ద్వారా బయటకు తీసుకువచ్చి వారిని ముందుకు నడిపించడంలో తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలన్నారు. కాగా, కరాటే పోటీలలో పెద్దపల్లి అశ్వంత్ (6వ తరగతి), మల్కాపురం సాయి ప్రతీక్ (6వ), కనుగంటి లిఖిత (3వ) గోల్డ్ మెడల్స్, పెద్దపల్లి యశ్వంత్ (4వ), యేషబోయిన భువనేశ్వరి (6వ), మల్కాపురం హరిప్రీత్ (5వ), కనుగంటి వర్షిణి (6వ), బండి అక్షర (6వ) సిల్వర్ మెడల్స్ అందుకున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 19 : ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత ఐదు రోజుల్లో 8 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేశారు. తాజాగా జఫర్‌గఢ్ ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో కూనూరు ఆకేరు వాగుల్లో నుంచి ఆదివారం రాత్రి ఐదు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. సోమవారం యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

జనగామ టౌన్, ఫిబ్రవరి 19: జనగామ ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, హైర్ బస్సు డ్రైవర్స్ క్లీనర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసీ డీఎంకు సమ్మె నోటీసు ఇచ్చారని, 12 రోజులు గడిచినా ఎలాంటి స్పందన రాలేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఈ నెల 21 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోయూనియన్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి మడికంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి క్యారం సంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురు, శుక్రవారాలు మేడారం జాతర, అలాగే చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ, హమాలీ, గుమస్తా కార్మికుల వినతి మేరకు సెలవులు, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి సోమవారం మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్లో పెరిగిన పత్తి ధర

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం పత్తి ధర అమాంతం పెరిగింది. క్వింటా రూ.7,010 చేరింది. గత రెండు నెలలుగా క్వింటా రూ.6,550 అటు ఇటుగా కొనసాగిన ధర సోమవారం రూ.7,010 చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, కేవలం 1,200 పత్తి బస్తాలు మాత్రం సోమవారం అమ్మకానికి వచ్చాయి. పత్తి విక్రయాలు తగ్గినప్పుడు ధరలు పెరగడం సహజమేనని వ్యాపారులు చెబుతున్నారు.

సమ్మక్క జాతరను వైభవంగా నిర్వహించాలి

- ఎఫ్‌పీవో మండల కోఆర్డినేటర్ మాలోతు రాజునాయక్
- శ్రీపతిపల్లి - కొండాపూర్ జాతరకు రూ.1 లక్ష విరాళం


శ్రీపతిపల్లిలో కోనేరును పరిశీలిస్తున్న రాజునాయక్

చిలుపూర్, ఫిబ్రవరి 19: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న వన దేవతల జాతరను వైభవంగా నిర్వహించాలని ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్) మండల కోఆర్డినేటర్ మాలోతు రాజునాయక్ అన్నారు. సోమవారం శ్రీపతిపల్లి - కొండాపూర్ గ్రామాల సరిహద్దుల్లో ఉన్న సమ్మక్క సారలమ్మ జాతరను ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. అనంతరం జాతర కమిటీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డితో కలిసి సమీపంలో ఉన్న కోనేరుతో పాటు, చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అమ్మవార్ల గద్దెలకు రంగులు, చలువ పందిళ్ళు వేయడం కోసం తనవంతుగా రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలోతు స్రవంతి, జ్ఞానేశ్వర్, పూజిత, వైస్‌చైర్మన్ పుట్ట రాజు, మాజీ సర్పంచ్ కొయ్యడ రాందాస్, గొంగిడి కృష్ణమూర్తి, రంగు హరీష్, సురేశ్, అంజి పాల్గొన్నారు.

జాతరలను సందర్శించిన ఎంపీడీవో..

చిలుపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నుంచి ప్రారంభం కానున్న సమ్మక్క సారలమ్మ జాతర్లను ఎంపీడీవో బర్మావత్ శంకర్ సందర్శించారు. సోమవారం ఆయన లింగంపల్లి, శ్రీపతిపల్లి - కొండాపూర్, చిలుపూర్, గార్లగడ్డ తదితర గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి పర్యటించారు. పారిశుధ్య, పైప్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత, ఈవో చిందం వంశీ, సీనియర్ అసిస్టెంట్లు చల్ల రాజేందర్ రెడ్డి, కుర్రెంల మోహన్, చైర్మన్లు కండ్లకోలు బాలరాజు, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, బోళ్ళ రాజ్‌కుమార్, హుస్సేన్ నాయక్, వైస్ చైర్మన్ రావులపెల్లి వెంకటేశ్వర్లు, అపరాధపు రాజు, చాతెల్లి రజాక్, గొడుగు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో..

పన్నుల వసూళ్లలో మార్కెట్ల ముందంజ



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

- రూ.438.58కోట్లకు గాను రూ.311.62కోట్ల వసూలు
- జనవరి నెలాఖరుకే 71శాతానికి చేరిక
- నూటికి నూరు శాతం లక్ష్యం చేరేలా ఉన్నతాధికారుల హుకుం
- చతికిల పడిన కొన్ని మార్కెట్లు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు, 110 వ్యవసాయ మార్కెట్లు పన్ను వసూళ్లలో లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి 31 వరకు 71 శాతం లక్ష్యాన్ని సాధించి విజయకేతనం ఎగరవేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. రీజియన్ పరిధిలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.311.38 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-2024 ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.438.58కోట్లు పన్ను రూపేణ వసూలు చేయాలని నిర్ణయించగా జనవరి 31 వరకే రూ.311.62కోట్ల ఆదాయాన్ని ఆర్జించి 71 శాతం లక్ష్యాన్ని సాధించింది. ఇక ఫిబ్రవరి, మార్చి రెండు నెలలు మిగతా 29శాతం పన్ను వసూలు చేసి లక్ష్యాన్ని చేరి నూటికి నూరు మార్కులు కొట్టేయాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు, డీఎంవోలు వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించి కార్యదర్శులకు ఆదేశాలు, సూచనలు, సలహాలను ఇస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు భూపాల్‌పల్లి చిట్యాల మార్కెట్ పన్ను వసూళ్లలో 102 శాతం వసూలు చేసి ముందంజలో ఉంది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా లోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని 18 వ్యవసాయ మార్కెట్ల పనితీరును పరిశీలిస్తే..

- వరంగల్ జిల్లాలోని ఏనుమాముల మార్కెట్‌కు రూ.42కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ.29.50కోట్లు వసూలు చేసి 70శాతం లక్ష్యాన్ని చేరిం ది. నర్సంపేట మార్కెట్‌కు రూ.6.62కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.2.42కోట్లు వసూలు చేసి 37 శాతం లక్ష్యాన్ని చేరింది. నెక్కొండ మార్కెట్‌కు రూ.1.40కోట్లకు గాను రూ.73లక్షలు వసూలు చేసి 52శాతం లక్ష్యాన్ని చేరింది. వర్ధన్నపేట మార్కెట్‌కు రూ.2.25కోట్లకు గాను కేవలం రూ.32లక్ష లు వసూలు చేసి 14 శాతానికి పడిపోయింది.
- హనుమకొండ జిల్లాలోని పరకాల మార్కెట్‌కు రూ.2.60కోట్లకు గాను రూ.కోటి16 లక్షలు వసూలు చేసి 45శాతం లక్ష్యాన్ని చేరింది. ఆత్మకూర్ రూ.కోటి14 లక్షలకు గాను రూ.35లక్షలు వసూలు చేసి 30 శాతం లక్ష్యాన్ని చేరింది.
- జనగామ జిల్లాలో జనగామ మార్కెట్ రూ.5.87 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.2.53కోట్లు వసూలు చేసింది. ఘన్‌పూర్ రూ.2.57కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.కోటి48లక్షలు వసూలు చేసింది. కొడకండ్ల రూ.కోటి88లక్షలు వసూలు చేయాల్సి ఉండగా రూ.కోటి 64లక్షలు వసూలు చేసింది. పాలకుర్తి రూ.82లక్షలకు గాను రూ.15లక్షలు వసూలు చేసింది.
- మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ మార్కెట్ రూ.6.88కోట్లు గాను రూ.5.95కోట్లు వసూలయ్యాయి. కేసముద్రం మార్కెట్ రూ.6.20కోట్లకు గాను రూ.5.47కోట్లు వసూలు చేసింది. తొర్రూరు మార్కెట్ రూ.3.96కోట్లకు గాను రూ.2.85కోట్లు వసూలు చేసింది.
- భూపాలపల్లి జిల్లాలో కాటారం మార్కెట్ రూ. 2.83 కోట్లు గాను రూ.కోటి34లక్షలు వసూలు చేసింది. చిట్యాల మార్కెట్ రూ.కోటి వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తిచేసి ముందంజలో ఉంది. భూపాలప ల్లి మార్కెట్ రూ.3.15కోట్లకు గాను రూ.కోటి68లక్షలు వ సూలు చేసింది. ములుగు జిల్లాలో ములుగు మార్కెట్ రూ.6.48కోట్లకు గాను రూ.4.55 కోట్లు వసూలు చేసింది.

2023 -2024 జనవరి 31 వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు 110 మార్కెట్‌లు కలిపి రూ. 438.58 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటికి రూ.311.62కోట్లు వసూలు చేసి 71శాతం లక్ష్యాన్ని చేరింది. మిగిలిన రెండు నెలల్లో వందకు వందశాతం లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలి..

- మల్లేశం, వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్



ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలి. కింది స్థాయిలో ఉన్న అధికారులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలి. ఇది నిరంతరం శ్రమిస్తే వచ్చే ఫలితం. అందుకే రోజు మార్కెట్లను సందర్శిస్తూ అక్కడి సాధకబాధకాలను ఆలకిస్తుంటాం. వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ మార్కెట్ ఫీజును వసూలు చేసేందుకు ప్రోత్సహిస్తాం. సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ అది ఎక్కడ కనిపించకుండా పనిచేసుకుంటూ ముందుకు వెళ్లడం వల్ల పనులు సులభతరమవుతాయి. పన్ను వసూళ్లలో ముందజలో ఉన్న వారికి శాఖ తరుపున ప్రశంసపత్రాలు, అవార్డులు, అభినందనలుంటాయి.